క్లుప్తంగా

నేడు కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం

కందుకూరు: కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్ఆర్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహిస్తున్నట్లు మండల మాజీ అధ్యక్షుడు ఎస్ కృష్ణనాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు తుక్కుగూడలోని కేఎల్ఆర్ కార్యాలయంలో సమావేశం ప్రారంభమవుతుందని తెలిపారు. అన్ని గ్రామాల బూత్ అధ్యక్షులు, ఆయా గ్రామాల్లోని ముఖ్య నాయకులు, హాజరుకావాలని ఆయన కోరారు.

నిబంధనలు పాటించాలి

సీఐ శంకర్ కుమార్

యాచారం: లోక్‌సభ ఎన్నికల కోడ్ నేపథ్యంలో సాగర్ రోడ్డుపై యాచారం పోలీసులు వాహనాల తనిఖీలను ముమ్మరం చేశారు. యాచారం, గునుగల్, చింతపట్ల, మాల్ తదితర గేట్ల వద్ద గురువారం కార్లు, ఇతర వాహనాలను నిలిపి క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే వదులుతున్నారు. నింబంధనలు తప్పక పాటించాలని, అతిక్రమిస్తే చర్యలు తప్పవని సీఐ శంకర్ కుమార్ హెచ్చరించారు.

31న సర్వసభ్య సమావేశం

అబ్దుల్లాపూర్‌మెట్: బాటసింగారం రైతు సేవా సహకార సంఘం 54వ సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం సంఘం కార్యాలయంలో చైర్మన్ చేగూరి భరత్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు మేనేజర్ ఐలేష్‌యాదవ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి డైరెక్టర్లతో పాటు సంఘం పరిధిలోని రైతులు, సభ్యులు, ఖాతాదారులు హాజరుకావాలని కోరారు.

రైతు సంక్షేమమే లక్ష్యం

రైతు సేవా సహకారం సంఘం చైర్మన్ భరత్‌కుమార్



ఆర్థికసహాయం అందిస్తున్న భరత్‌కుమార్

అబ్దుల్లాపూర్‌మెట్: ప్రతి రైతు సంక్షేమమే ధ్యేయంగా సేవలందిస్తున్నామని బాటసింగారం రైతు సేవా సహకార సంఘం చైర్మన్ భరత్‌కుమార్ అన్నారు. సంఘంలో సభ్యత్వం ఉండి మృతి చెందిన సభ్యుల కుటుంబాలకు సంఘం ద్వారా రూ.25వేల నగదు అందజేస్తున్నామన్నారు. తారమతిపేట గ్రామానికి చెందిన ఎం.మల్లయ్య జనవరి 8వ తేదీన మృతి చెందడంతో ఆయన భార్య అంజమ్మకు సంఘం కార్యాలయంలో చైర్మన్ భరత్‌కుమార్ చేతుల మీదుగా గురువారం రూ.25వేల నగదును అందజేశారు. సహకార సంఘం సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ ఐలేష్‌యాదవ్, నాయకులు మల్లేష్, యాదయ్య, బాలరాజుగౌడ్ పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా జగన్



జగన్

ఆమనగల్లు: ఆమనగల్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మల్లెపల్లి జగన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆమనగల్లులో కోర్టు ఏర్పడిన అనంతరం బార్ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించిడం ఇదే తొలిసారి. గురువారం నిర్వహించిన ఎన్నికల్లో.. ఎన్నికల నిర్వహణాధికారిగా సీనియర్ న్యాయవాది లక్ష్మణ్‌శర్మ వ్యవహరించారు. న్యాయవాదులందరి సమక్షంలో బార్ అసోసియేషన్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మల్లెపల్లి జగన్, ఉపాధ్యక్షుడిగా సుధాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఆంజనేయులు యాదవ్, సంయుక్త కార్యదర్శిగా రామకృష్ణ, లైబ్రరీ కార్యదర్శిగా శేఖర్, కోశాధికారిగా మధును ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు జానకీరాములు యాదవ్, యాదీలాల్, మల్లేశ్‌గౌడ్, విజయ్‌కుమార్, కృష్ణ, మల్లేశ్, దేవేందర్, గణేశ్, బిక్యానాయక్, మురళీకృష్ణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఫేక్ ఫోన్ కాల్స్‌పై అప్రమత్తంగా ఉండాలి

- శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్

చేవెళ్ల: మున్సిపాలిటీలో పన్నుల చెల్లింపుల విషయంపై వస్తున్న ఫేక్ ఫోన్ కాల్స్‌ను వ్యాపారులు నమ్మి మోసపోవద్దని శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని దుకాణాదారులు, వ్యాపారవేత్తలకు కొందరు వ్యక్తులు మున్సిపాలిటీ నుంచి ఫోన్ చేస్తున్నామని చెప్పి ట్రేడ్ లైసెన్స్ ఫీజులు చెల్లించలేదు వెంటనే డబ్బులు చెల్లించాలని చెబుతున్నారన్నారు. వెంటనే ఆన్‌లైన్‌లో డబ్బులు కట్టాలని కోరుతూ డబ్బులు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అందుకు దుకాణాదారులు, వ్యాపారవేత్తలు ఫేక్ ఫోన్ కాల్స్‌పై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆన్‌లైన్‌లో డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేసే ముందు ఒక్కసారి ఆలోచన చేయాలని ఫోన్ చేసింది మున్సిపాలిటీకి సంబంధించిన వారేనా తెలుసుకోవాలన్నారు.

చెత్తకు నిప్పు!

ఇళ్ల మధ్య తగులబెడుతున్నారు

- పొగతో ఉక్కిరి బిక్కిరి
- నిబంధనలు బేఖాతరు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న కాలనీవాసులు
- పట్టించుకోని అధికారులు



సిర్లాహిల్స్‌లో ఇళ్ల మధ్య చెత్తకు నిప్పంటించడంతో వెలువడుతున్న పొగ

మీర్‌పేట: ఇంటి పరిసరాల్లో వెలువడే చెత్తను పేర్చి తగులబెడుతున్నారు. దీంతో కాలనీ వాసులు ఉక్కిరి బిక్కిరవుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలో మున్సిపల్ సిబ్బంది చెత్తను సేకరించి తరలించాలి. కానీ కొందరు అక్కడ చేరిన చెత్త, చెదారాన్ని కుప్పగా చేసి మంట పెట్టడంతో కాలనీ వాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చెత్త తగులబెట్టొద్దన్న నిబంధనలు ఉన్నప్పటికీ వాటిని బేఖాతరు చేస్తున్నారు. ఈ విషయంలో శానిటేషన్ అధికారులు పట్టించుకోకపోవడంతోనే సమస్య ఉత్పన్నమవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బస్తీల్లో..

నిర్మానుష్య ప్రాంతాలతో పాటు ఇండ్ల మధ్య, కాలనీలు, బస్తీల్లోని ఖాళీ ప్రదేశాల్లో ఉదయం చెత్తను సేకరించి కాల్చేస్తున్నారు. దీంతో పెద్ద ఎత్తున పొగ వెలువడి ఇళ్లలోకి వ్యాపించడంతో ఊపిరితీసుకోవడం ఇబ్బందికరంగా మారుతుంది. దాదాపు గంట నుంచి రెండు గంటల పాటు పొగ వస్తుండడంతో చేసేది లేక మండుతున్న చెత్తమీద నీటిని పోసి ఆర్పాల్సిన దుస్థితి నెలకొందని పలువురు పేర్కొంటున్నారు.

పోలీస్‌స్టేషన్‌కు వెళ్లే దారిలోనే..

మీర్‌పేట పోలీస్‌స్టేషన్‌కు వెళ్లే దారిలో సిర్లాహిల్స్ కాలనీలోని ఖాళీ స్థలం ఉంది. అక్కడ నిత్యం చెత్తను తగులబెడుతున్నారని, చుట్టూ నివాసా ప్రాంతాలు ఉన్నప్పటికీ ఈ విషయాన్ని ఎవరూ పట్టించుకోవడం లేదు. అక్కడే స్టేషన్‌కు వచ్చే వాహనాలతో పాటు స్థానికులు తమ వాహనాలను పార్క్ చేస్తుంటారు. అసలే వేసవి కావడంతో తరచూ చెత్తకు మంట పెట్టడంతో అగ్ని ప్రమాదం చోటు చేసుకునే అవకాశం లేకపోలేదని కాలనీ వాసులు భయపడుతున్నారు. ఏదైనా అనుకోని ప్రమాదం సంభవిస్తే పెద్ద ఎత్తున నష్టం వాటిల్లొచ్చని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే శానిటేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

కొన్ని ప్రాంతాల్లో చెత్త తగులబెడుతున్నట్లు తన దృష్టికి వచ్చింది. ఈ సమస్య పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటాం. అదే విధంగా కాలనీలు, బస్తీల్లో చెత్తను ఎప్పటికప్పుడు తరలించేలా చూస్తాం.

– రమేశ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్

అన్ని రంగాల్లో రాణించాలి



ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాల ప్రదానం

నారాయణ పాఠశాల ప్రిన్సిపాల్ బాబ్జీ

మీర్‌పేట: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని వనస్థలిపురం జోన్ నారాయణ పాఠశాల ప్రిన్సిపాల్ బాబ్జీ పేర్కొన్నారు. పాఠశాలలో జరిగిన స్పెల్‌బీ జోనల్ స్థాయి క్విజ్ పోటీల్లో మీర్‌పేట నారాయణ విద్యార్థులు సత్తా చాటారని ఆయన పేర్కొన్నారు. ఈ పోటీల్లో తొమ్మిదోతరగతి సాయి సుజిత్, బి ఋత్విక్ ప్రథమ, పల్లవి, వైష్ణవి, సాయినిఖిల్, శ్రేష్ఠ, త్రిజల్, పుష్పహాస్‌లు ద్వితీయ బహుమతులు గెల్చుకున్నారన్నారు. ఈ సందర్భంగా బాబ్జీ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని కష్టపడి చదువుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ శివరంజని, సీఓ మనోహర్, ఏడీ రాజేందర్, బోజిరెడ్డి, యోగేంద్ర పాల్గొన్నారు.

రైల్వే గేట్‌తో ఇబ్బంది

కొత్తూరు: పట్టణ సమీపంలోని ఎస్సీ కాలనీ వద్ద రైల్వే పట్టాలపై అండర్‌పాస్ వంతెన నిర్మించాలని కాంగ్రెస్ ఎస్సీ సెల్ షాద్‌నగర్ నియోజకవర్గ అధ్యక్షుడు సురేందర్ గురువారం ఒక ప్రకటనలో అధికారులను కోరారు. రైల్వే గేట్ కారణంగా స్థానికులతో పాటు కుమ్మరిగూడ, ఫాతీమాపూర్, అక్కివానిగూడ గ్రామాలకు వెళ్లే ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు. గతంతో పోలిస్తే ప్రస్తుతం రైళ్ల రాకపోకలు పెరగడంతో తరచుగా గేటు వేస్తున్నట్లు తెలిపారు. దీంతో అత్యవసర సమయాల్లో ఆస్పత్రులకు వెళ్లే వాహనాలు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు.

నేషనల్ లెవల్ టెక్నికల్ ఫెస్ట్



నేషనల్ లెవల్ ఫెస్ట్‌లో పాల్గొన్న అతిథులు, విద్యార్థులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్ స్ఫూర్తి ఇంజనీరింగ్ కాలేజీలో బుధవారం 2కె24 పేరిట ప్రారంభమైన నేషనల్ లెవల్ టెక్నికల్ ఫెస్ట్ గురువారం ముగిసింది. రోబోకోడ్, స్క్రాచ్ గేమ్స్, హ్యాకథాన్ ప్రాజెక్ట్ ఎక్స్‌పో, బ్లాక్ చైన్ టెక్నాలజీ మీద కాంటెస్ట్, మరియు టెక్నికల్ క్విజ్ నిర్వహించారు. వీటితో పాటు పలు రంగాల్లో పోటీ నిర్వహించి విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలతో విద్యార్థుల్లో మేధాశక్తిని పెంపొందించొచ్చన్నారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని పలు ఇంజనీరింగ్ కళాశాలలనుంచి సుమారు 200లకు పైగా విద్యార్థులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కాలేజీ సెక్రెటరి ఎస్ జగన్మోహన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ డి మహేశ్వర్, డీన్ డాక్టర్ గిరిధర్, ప్రోగ్రామ్ కన్వీనర్స్ ప్రొఫెసర్ రాంమ్మోహన్‌రావు, డాక్టర్ రమేశ్‌రావు, ప్రోగ్రాం కోఆర్డినేటర్స్ మహమ్మద్ ముస్కిన్ అలీ, ఖలీల్ అహ్మద్, మహ్మద్ అఫ్జల్, సిబ్బంది పాల్గొన్నారు.

నీటిని పొదుపుగా వాడుదాం

గాంధేయన్ విద్యాసంస్థల చైర్మన్ రాజేందర్‌రెడ్డి



ఇంకుడు గుంతలపై అవగాహన కల్పిస్తున్న రాజేందర్‌రెడ్డి

హయత్‌నగర్: జీవ జాతికి ప్రాణాధారమైన నీటిని పొదుపుగా వాడుకోవాలని గాంధేయన్ విద్యాసంస్థల చైర్మన్ గున్న రాజేందర్‌రెడ్డి అన్నారు. జాతీయ జల దినోత్సవాన్ని పురస్కరించుకుని జలమండలి, గాంధీ జ్ఞానప్రతిష్టాన్ ఆధ్వర్యంలో గురువారం పెద్ద అంబర్‌పేట్ మున్సిపాలిటీ కుంట్లూర్‌లో ఉన్న గాంధేయన్ కళాశాలలో.. నీటి వాడకం, సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. నగరాలు కాంక్రీట్‌తో నిండిపోవడ వలన వర్షపు నీరు భూమిలోకి ఇంకడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నీటిని రక్షించేందుకు ఇంకుడుగుంతల నిర్మాణం ఉత్తమమైన మార్గమని.. అవకాశం ఉన్న ప్రతిచోట 40 రకాలుగా ఇంకుడు గుంతలు నిర్మాణం చేయవచ్చ పేర్కొన్నారు. నీటి సంరక్షణపై విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో గాంధీ విద్యా సంస్థల వైస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కృష్ణయ్య, ప్రేమ్‌కుమార్, నాయకులు శివారెడ్డి, ప్రణీత్ కుమార్‌రెడ్డి, చైతన్యరెడ్డి, బార్గవ్, సతీష్, సాయి, రఘురాం తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు చర్యలు తీసుకుంటా



తాగునీటి సమస్యపై సమీక్షలో పాల్గొన్న అధికారులు

మంచాల: గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు. మంచాల గ్రామంలో తాగునీటి సమస్యపై గురువారం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సమీక్ష నిర్వహించిన అనంతరం వారు మాట్లాడుతూ.. మంచాలలో ప్రస్తుతం ఎలాంటి తాగునీటి ఇబ్బందులు లేవని, భవిష్యత్‌లో కూడా రాకుండా చూస్తామని పేర్కొన్నారు. పాడైపోయిన మోటార్ల రిపేర్, పైపులైన్ల లీకేజీలు వంటి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో ప్రజలకు నీటిఎద్దడి రానివొద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ నర్సింహులు, డీఈఈ రాజు, ఏఈఈ స్రవంతి, ఈఓఆర్డీ తేజ్‌సింగ్, మిషన్ భగీరథ ఏఈఈ అనిరుధ్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వివాహానికి ఆర్థికసాయం

తలకొండపల్లి: మండల పరిధిలోని పెద్దూర్ తండాకు చెందిన మెగావత్ బద్యా నాయక్ కూతురికి వివాహం నిశ్చయమయ్యింది. పెళ్లి ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయాన్ని అందజేసి ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డిని కోరారు. స్పందించిన ప్రభాకర్‌రెడ్డి గురువారం తండాకు వెళ్లి రూ.10,000 ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో శ్రీను, చందర్, కృష్ణ, భాస్కర్, హీరాలాల్, సరేందర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీటీసీ వెంకటేశ్ ఆధ్వర్యంలో..

తలకొండపల్లి: జిల్లాలోని కేశంపేట్ మండలం తులవాని గడ్డ గ్రామానికి చెందిన శృతి వివాహం జరుప నిశ్చయించారు. పెళ్లికి ఆర్థిక సహాయం అందజేసి ఆదుకోవాలని జెడ్పీటీసీ వెంకటేశును అమ్మాయి తల్లిదండ్రులు సుక్కయ్య, సుగుణమ్మ కోరారు. స్పందించిన జెడ్పీటీసీ శృతి గురువారం హైదరాబాద్‌లో ట్రస్టు సభ్యులచే రూ.15,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో బుచ్చిబాబు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

దుమ్ము సమస్యను పరిష్కరించండి

కొత్తూరు: పట్టణంలోని పాత జాతీయ రహదారిపై వాహనాల రాకపోకల కారణంగా వెలువడుతున్న దుమ్ము సమస్యను అధికారులు వెంటనే పరిష్కరించాలని వ్యాపారులు కోరుతున్నారు. కొన్నేళ్ల నుంచి మరమ్మతులు లేకపోవడంతో రోడ్డు గుంతలమయంగా మారిందని వాపోతున్నారు. దీంతో వాహనాల రాకపోకల కారణంగా విపరీతమైన దుమ్ము వెలువడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దుకాణాల్లో ఉన్న వస్తువులు, తిను బండారాలపై దుమ్ము పేర్కొంటుండడంతో తాము నష్టపోతున్నట్లు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యను వెంటనే పరిష్కరించాలని వ్యాపారులు, ప్రజలు కోరుతున్నారు.

ఉపాధికి ఊతమేది?

- కూలీలకు ప్రోత్సాహం కరువు
- పని జరిగేచోట కనిపించని రక్షణ చర్యలు
- మండలంలో కొన్ని పంచాయతీల్లోనే కొనసాగుతున్న వైనం
- ఏపీఓ లేక దాదాపు రెండేళ్లుగా ఇన్‌చార్జితోనే పనులు



ఆలూరులో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు

చేవెళ్ల: గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కూలీలకు ప్రోత్సాహం కరువవుతోంది. గ్రామాల్లో వలసలను నివారించడానికి కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ పథకం కింద పథకం వందరోజులు పనులు కల్పించాలి. కానీ ప్రజాప్రతినిధుల అలసత్వం, అధికారుల నిర్లక్ష్యం కారణంగా కూలీలకు ఆ దిశగా ప్రయోజనం చేకూరడం లేదు. అధిక ఉష్ణోగ్రతలో పని చేస్తున్నందుకు కూలీలకు వేసవి భత్యంతో పాటు అన్ని సౌకర్యాలు కల్పించేవారు. నిబంధనల ప్రకారం కూలీలకు సౌకర్యాలు కల్పించకుండా పనులు చేయించామా లేదా అన్నట్లుగా ఈ పథకం తీరు కొనసాగుతోంది. మూడు నెలలుగా కూలీ డబ్బులు రాకపోవడంతో కూలీలు చాలా ఇబ్బంది పడుతూ పనులకు వస్తున్నారు. చేవెళ్ల డివిజన్‌లోని నాలుగు మండలాల్లో ఉపాధి హామీ పనుల తీరు ఇలాగా కొనసాగుతోంది.

కొన్ని గ్రామాలకే పరిమితమైన పనులు

మండలంలో 37 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. మొత్తం 4 వేల మందికి జాబ్‌కార్డులు ఉన్నాయి. కానీ ఉపాధి పనులు మాత్రం కొన్ని గ్రామాల్లోనే కొనసాగుతున్నాయి. ప్రస్తుతం మండలంలో 400ల మంది కూలీలు మాత్రమే పనులు చేస్తున్నారు. అధికారులు కూలీలు పనులకు రావటం లేదని అందుకే పనులు జరగటం లేదని అంటున్నారు. కానీ పనులు జరిగే గ్రామాల్లో కూలీలు పెద్ద సంఖ్యలోనే హాజరవుతున్నారు. పనులు చేసినా కూలీలకు సకాలంలో డబ్బులు రావటం లేదు. గతంలో పని చేసిన కూలీలకు సంబంధించి జనవరి నెలలో కూలీ డబ్బులు వచ్చాయని అప్పటి నుంచి పనిచేస్తున్న కూలీలకు ఇప్పటికీ డబ్బులు రాలేదు. ప్రభుత్వం నుంచి డబ్బులు తప్పకుండా వస్తాయనే నమ్మకంతో కూలీలు పనులు చేసుకుంటూ పోతున్నారు.

కనిపించని సౌకర్యాలు

ఉపాధి హామీ పథకంలో భాగంగా పనులు చేసే కూలీలకు పనిచేసే చోట నీటి సౌకర్యం, ఎక్కువగా ఎండ ఉన్న సమయంలో సేద తీరేందుకు అందుబాటులో టెంట్ వేయటం, ఏదైనా అనుకోని ప్రమాదం జరిగితే కూలీలకు అక్కడే ప్రథమ చికిత్స చేసేందుకు ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందుబాటులో ఉంచాలని నిబంధనలు ఉన్నాయి. వీటితోపాటు కూలీలకు అవసరమైన పనిముట్లు కూడా ఉపాధి పనుల్లో అందించాలని ఉంది. కాని వీటిలో ఏ నిబంధనలు ఉపాధి హామీ పథకంలో కనిపించటం లేదు. కేవలం కూలీలకు పనులు కల్పించి పనులకు వేతనం వారి ఖాతాలో వేయటం మాత్రమే జరుగుతుందని చెబుతున్నారు. పనులు లేకపోవటంతో ఈ పనులు చేసుకుంటున్నామని వేతనాలు రాక ఇబ్బందులు ఉన్నా ఉపాధి కోసం ఈ పనులు చేస్తున్నట్లు కూలీలు వాపోతున్నారు. అధికారులు మాత్రం ప్రభుత్వం నుంచి వచ్చే ఆదేశాలను అమలు చేస్తూ ముందుకు సాగుతున్నామని చెబుతున్నారు. వచ్చే నెల నుంచి కొత్త ఆర్థిక సంవత్సరం కొత్త పనులు పెడతామని చెబుతున్నారు. వేసవి అలవెన్స్ కూడా ఇవ్వడం లేదని వాపోతున్నారు. పనులను పర్యవేక్షించాల్సిన ఏపీఓ లేకపోవటంతో ఈసీకి ఇన్‌చార్జి ఇవ్వటంతో ఈసీ రాజశేఖర్ మండలంలోని ఉపాధి పనులను పర్యవేక్షిస్తున్నారు. కానీ ఆయన ఎప్పుడు అందుబాటులో ఉండటం లేదని కిందిస్థాయి సిబ్బంది వాపోతున్నారు. క్షేత్రస్థాయి పర్యవేక్షణ కూడా చేయటం లేదని, కొత్త ఏపీఓను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

కూలీల సంఖ్యను పెంచేందుకు కృషి చేస్తాం



మండలంలో ఉపాధి పనులకు ఇప్పుడిప్పుడే కూలీలు వస్తున్నారు. కూలీల సంఖ్య ఇంకా పెరగాల్సి ఉంది. వచ్చేనెల నుంచి కొత్త ఆర్థిక సంవత్సరం వేసవి కాలంలో పనులు ఎక్కువగా అవసరం ఉంటాయి. ఇప్పటికే అన్ని గ్రామాల్లో పనులు కల్పిస్తామని కూలీలు ముందుకు రావాలని కోరుతున్నాం. పూర్తిస్థాయిలో కూలీలు రావటం లేదు. కూలీలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కూలీ డబ్బులు, సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తాం. మండల ఏపీఓను కూడా ఏర్పాటు చేసేందుకు ఉన్నతాధికారులను నివేదిస్తాను.

– హిమబిందు, ఎంపీడీఓ, చేవెళ్ల

చేవెళ్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శ్రీనివాస్‌రెడ్డి

చేవెళ్ల: చేవెళ్ల కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా జి.శ్రీనివాస్‌రెడ్డి ఎన్నికయ్యారు. గురువారం మండలంలోని కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల్లో గెలుపొందిన వారిని ప్రకటించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా జి.శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాక్షుడిగా డి.గౌతమ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బి.సత్యానందం, సంయుక్త కార్యదరిగా ఎం.తాజుద్దీన్, కోశాధికారిగా జనార్దన్, స్పోర్ట్స్ కల్చరల్ కార్యదర్శి ఎం.ముక్తర్ షరీఫ్, లైబ్రేరియన్ ఎం.గోపాల్, పి.రాజారెడ్డి, ఎగ్జిక్యూటీవ్ మెంబర్లు శ్రీధర్, యాదగిరిగౌడ్, సీహెచ్ రవీందర్, శివరాజ్‌గౌడ్, ఈశ్వర్లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికైన కమిటీ సభ్యులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో న్యాయవాదులు, సిబ్బంది ఉన్నారు.

షాద్‌నగర్ బార్ అసోసియేషన్..

షాద్‌నగర్: షాద్‌నగర్ బార్ అసోసియోషన్‌కు 2024–25 సంవత్సరానికి సంబంధించిన ఎన్నికలు గురువారం కోర్టు ఆవరణలో నిర్వహించారు. అధ్యక్ష పదవి కోసం రాజశేఖర్‌రాజు, వేణుగోపాల్‌రావు, రజాక్ హుస్సేన్‌లు పోటీ పడ్డారు. ఈ ఎన్నికల్లో మొత్తం 141 ఓట్లకుగాను 137 ఓట్లు పోలైనట్లు ఎన్నికల అధికారి మర్రి శంకరయ్య తెలిపారు. ఇందులో రాజశేఖర్‌రాజుకు 86 ఓట్లు పోలవగా, వేణుగోపాల్‌రావుకు 48ఓట్లు, రజాక్ హుస్సేన్‌కు మూడు ఓట్లు పోలయ్యాయి. రాజశేఖర్‌రాజు 38 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ఉపాధ్యాక్షులుగా శ్రీనివాసులు, విజయ్‌భాస్కర్‌గౌడ్ ఎన్నికయ్యారు.

సన్మానం

ఇబ్రహీంపట్నం: ఉప్పరిగూడ పీఏసీఎస్ చైర్మన్‌గా ఎన్నికైన పాండు రంగారెడ్డిని గురువారం కాంగ్రెస్ శ్రేణులు కలిసి అభినందనలు తెలిపారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు ముత్యాల రాజశేఖర్‌రావు, సీనియర్ నాయకులు రమేష్, నాగేశ్, సంతోష్‌కుమార్, భానుచందర్, భానుప్రసాద్ తదితరులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఆయన మరిన్ని పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు.

ప్రతీవారం డబ్బులు చెల్లించాలి



కూలీలతో మాట్లాడుతున్న శ్రీను నాయక్

- వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనునాయక్

షాద్‌నగర్: కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకంలో అనేక మార్పులు తీసుకొస్తూ చివరికి ఈ పథకాన్ని ఎత్తివేసేందుకు కుట్రలు పన్నుతోందని వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీను నాయక్ అన్నారు. గురువారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కడియాలకుంట తండా గ్రామంలో ఉపాధి కూలీలు పని చేస్తున్న ప్రదేశాన్ని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు ప్రభుత్వం ప్రతీవారం కూలి చెల్లించాలని డిమాండ్ చేశారు. రెక్కాడితే కాని డొక్కాడని కూలీలకు ప్రభుత్వం సక్రమంగా చెల్లించకపోవడం దారుణమన్నారు. కూలీలకు నెలల తరబడి వేతనాలు చెల్లించకపోవడంతో వారు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అదేవిధంగా కూలీ పనులు చేసే ప్రాంతాల్లో అధికారులు మౌలిక సదుపాయాలు కూడా కల్పించడం లేదని విమర్శించారు. గ్రామ పంచాయతీ ట్రాక్టర్లలో కూలీలను పని ప్రదేశానికి తీసుకెళ్లాలని, హాజరు కోసం ఫొటోలు తీసే విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పెరిగిన నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా ప్రభుత్వం కూలీలకు వేతనాలు పెంచాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్, రవి, సురేశ్, శ్రీకాంత్, సంతోష్, శారద, జ్యోతి, సీతమ్మ, శ్రీను, జానీ, బుజ్జి, సింధూ, వాలీ తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌లో ఆక్రమణల తొలగింపు

చైతన్యపురి: ఫుట్‌పాత్ వ్యాపారులు సర్వీస్‌రోడ్డును ఆక్రమించుకుని వ్యాపారాలు చేయటం వల్ల కాలనీల్లో రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని, మెట్రో ప్రయాణికులు నడవటానికి దారిలేక అవస్థలు పడుతున్నారని చైతన్యపురి డివిజన్‌లోని ప్రభాత్‌నగర్, సాయినగర్ కాలనీల ప్రజలు చేసిన ఫిర్యాదుపై ట్రాఫిక్ అధికారులు గురువారం స్పందించారు. స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు సాగిస్తున్న వారిని, సర్వీస్ రోడ్డులో ఉన్న తోపుడుబండ్లను అక్కడ నుంచి తొలగింపజేశారు. ట్రాఫిక్ ఇబ్బందులు కలిగిస్తున్న డీసీఎం వాహనాలకు చలాన్లు వేశారు. చైతన్యపురి కార్పొరేటర్ రంగానర్సింహగుప్తా ఆధ్వర్యంలో అక్కడకు చేరుకున్న పలు కాలనీల ప్రజలు తాము ఎదుర్కుంటున్న సమస్యను ట్రాఫిక్ పోలీసులకు వివరించారు. ఎంతో కాలంగా రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, కాలనీలోకి అంబులెన్స్ కూడా వచ్చే పరిస్థితి లేకుండా పోయిందని ఆరోపించారు. ఈదారి గుండా మహిళలు నడవాలంటేనే బయపడుతున్నారని అన్నారు. ఇక ముందు చిరువ్యాపారులు మళ్లీ సర్వీస్‌రోడ్డు, ఫుట్‌పాత్‌లు ఆక్రమించుకోకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఇకముందు ఇబ్బందులు కాకుండా చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు జగదీష్, నాగరాజు గౌడ్ కాలనీవాసులకు హామీ ఇచ్చారు.